# తలకొరివి

**-ఎ. సువర్ణ**

"అమ్మో... అమ్మో... ఆ మధురవాణి... ఇంత మంచి రోజున చచ్చిపోవడమా...!", "దానికా ఇంత మంచి చావు....!" "ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో కానీ ఈ జన్మలో చేసుకున్నదికాదు...!" "అది ఈ జన్మలో చేసినదంతా పాపమే...!" అని మకర సంక్రాంతి తెల్లారేప్పటికి కూర్చున్నది కూర్చున్నట్లుగా సునాయాసంగా మరణించిన మధురవాణి మరణం గురించే ఆ గ్రామమంతా మాట్లాడారు.

ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించింది... ఆ రోజు నుంచీ ఆరు నెలల కాలంలో మరణించినవారు స్వర్గద్వారాల ముందు నిల్చుని తలుపులు తట్టక్కరలేదు. స్వర్గ ద్వారాల తలుపులు బార్లాగా తెరిచుంటయి... మకర సంక్రాంతి రోజునే మరణించిన మధురవాణి ఆత్మ సరాసరి స్వర్గంలోకి వెళ్లిపోయింది. కాని భూలోకంలోనే వదిలేసిన ఆమె భౌతిక కాయానికి అంత్య సంస్కారాలు ఎవరు చేస్తారన్నదే ఇప్పుడు ప్రశ్న...?

శవాన్ని ఊళ్లో వుంచుకుని దేముడి గుడిలో పూజలు చెయ్యకూడదని ఊళ్లోని శివాలయం, వాసుదేవాలయం తలుపులు తెరవలేదు తొమ్మిది గంటలు కావస్తున్నా...! ధనుర్మాస పూజకని తెల్లవారు ఝూమునే వాసుదేవాలయంలో పూజచేసి నైవేద్యం పెట్టి దద్ధోజనం, చక్రపొంగలి కోసం అని వచ్చిన పిల్లల మూకకి ఆ రోజు దేవాలయం తలుపులే తెరవకపోవడం నిరుత్సాహంగా వుంది.

అందరూ తలోరకంగా మాట్లాడుకునేవారే కానీ, మధురవాణి శరీరాన్ని దహనసంస్కారం చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు నా అనే వాళ్లెవరూ లేని ఆమెకు.

పది... పదకొండు... పన్నెండు... మిట్ట మధ్యాహ్నం అయింది.

ఆయమ్మ బాగావున్నన్నాళ్లు ఆ ఇంటి ముంగిట పడిగాపులు గాచిన ఒక్క నాయాలు ఆమెకు అగ్గి పెట్టడానికి ముందుకు రారే... అని మధురవాణి పక్కింట వున్న మంగయ్య అనుకుంటూండగానే దుమ్మురేపుకుంటూ ఖరీదైన విదేశీకారు ఊళ్లోకి ప్రవేశించి మెల్లగా వస్తూంటే ఆ ఊళ్లోని కుర్రకారంతా కారు వెనకాలే పరుగెత్తుకొస్తున్నారు.

ఆ కారు సరాసరి వెళ్లి శివాలయం ముందు ఆగింది. ఆగిన కారులోంచి పంచె కట్టుతో దిగుతున్న శర్మను చూస్తూనే ఆలయ ధర్మాధికారి పరిగెత్తుకుంటూ ఆయన వద్దకు వచ్చేసి... అయ్యా తమరొచ్చేశారా బాబూ... తమరి కోసమే కాచుకు కూర్చున్నాను... అని అంటే శర్మ... నేను రావడం కాస్త ఆలస్యం అయిందనుకుంటాను. అభిషేకాలకి అన్నీ సిద్ధం చేశారా...?" అని అడిగాడు.

"ఇంకెక్కడి అభిషేకాలు బాబూ... ఊళ్లో చావు అయిందండీ...!" అని ధర్మాధికారి అనగానే, "ఎవరు పోయారు...?" అడిగాడు శర్మ.

"ఆ... అంత చెప్పుకోదగ్గ మనిషి కాదులెండి... ఆ బోగంపాప... మధురవాణి... అని ఆయన ఏదో అనరాని వాళ్లపేరు ఉచ్చరించినట్లుగా లెంపలేసుకున్నాడు.

"ఆ ముండకు చితి అంటించేవారే లేరండి... పొద్దుననగా పోయిన పీనుగ ఇంకా అలాగే వుందండి... అని ఆయన చెప్పే మాటలింకా పూర్తికాక ముందే శర్మ మళ్లీ కారులో కూర్చుని మధురవాణి ఇంటి వైపుకి వెడుతూంటే ఆయన

## అద్దం

నీతి– శూన్యం–
భూతద్దమెందుకు?
అవినీతి–
ముంజేతి కంకణం,
అద్దమెందుకు

– సాయిప్రకాష్

ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

శర్మ కారులోంచి దిగుతూండగానే మంగయ్య ఆయన ముందుకొచ్చి భోరుమన్నాడు... మధురవాణి శవం ముందు మోకరించి మూసుకున్న అతని కళ్లలోంచి కన్నీరు కారి మధురవాణి శరీరం మీద పడి స్నానం చేసినట్లయింది... ఆమె తల దగ్గర దీపం వెలిగించి పెట్టిన శర్మ "మంగయ్యా, అమ్మ దహనానికి కావలసిన ఏర్పాట్లు చెయ్యి..." అని జేబులోంచి పైకం తీసి ఇచ్చాడు.

నిప్పుకుండతో శవం ముందు నడిచి మధుర వాణి శవానికి తల కొరివి పెట్టాడు శర్మ...

అగ్రహారంలోని ఘనాపాటీ లందరూ శర్మని బ్రాహ్మణ కులం నుంచి బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు... అప్పటి కప్పుడు రచ్చబండ వద్దకు పెద్దలంతా చేరి శర్మని పంచాయితీకి రమ్మని కబురు పెట్టారు. "ఆయన ఈ ఊరి పొలిమేరలు దాటేంత వరకూ మా ఎవరిళ్లలోనూ పొయ్యి వెలిగించం..!"

"ఆయన్ని తక్షణం వెళ్లిపొమ్మని చెప్పండి... దేముడికి పూజలు, అభిషేకాలంటూ మళ్లీ ఈ ఊళ్లో అడుగుపెట్టకూడదని శాసించండి..."

శర్మ చేతులు జోడించి అందరికీ నమస్కరిస్తూ చిరునవ్వుతో వచ్చి మునసబు పక్కన నిల్చున్నాడు.

"శర్మగారూ, వీరందరూ మిమ్మల్ని దోషి అని కులం నుంచి బహిష్కరించమంటున్నారు... అందుకు మీరేమంటారు...?" పంచాయితీ పెద్ద ప్రశ్నించాడు. శర్మ సమాధానం చెప్పేంతలోగానే...

"ఆయన ఈ పొలెంలోంచి వెళ్లిపోయేంత వరకూ మా ఎవరిళ్ళలో పొయ్యిలు వెలిగించం..." అని కరణం అన్నాడు.

"ఇంకెప్పుడూ ఈ ఊరి పొలిమేరలలో అడుగుపెట్టకూడదని శాసించండి..."

"కారు, బంగళా, డబ్బు అంటూ ఎన్ని హోదాలు సంపాదిస్తే మాత్రం ఏ ప్రయోజనం...? మంచి నడత నడవడి లేకపోయాక..?" అలా అక్కడ కూడిన పెద్దలందరూ తలో రాయి విసిరారు శర్మమీద.

"మునసబు గారూ, ముందసలు నేను చేసిన నేరం ఏమిటో చెప్పకుండా నన్ను దోషిగా నిలబెడితే నేనేం చెప్పను...? ముందు నేను చేసిన తప్పేమిటో చెప్పండి...? అన్న శర్మని అందరూ కోపంగా చూశారు.

మధురవాణి దేహానికి తలకొరివి పెట్టడమే అతని నేరం అని చెప్పాడు పంచాయితీ పెద్ద.

"అయ్యా, అసలు అనాధ ప్రేతానికి దహనసంస్కారాలు చెయ్యడం పుణ్యం అని అంటారు కదండీ... అయినా నాకు తెలీక అడుగుతాను. ఎంత సేపని ప్రేతాన్ని ఊళ్లో వుంచుకుని గుడితలుపులు మూస్తారు. ఎవరిళ్లలోనూ పొయ్యి వెలిగించకుండా కూర్చుంటారు... మునిసిపాలిటి వాళ్లు వచ్చేదాక శవాన్ని అలాగే వుంచితే శవం కంపుకొడుతుంది. అది మరీ ఘోరం.

"మధురవాణి అనాథ కాదు.. ఆమె నాకు తల్లితో సమానం. ఆమె మరణించిన సమయానికి సరిగ్గా నేను ఊళ్లోకి రావడం నేను చేసుకున్న పుణ్యం... అసలామె నాకు తల్లి స్థానంలోకి రావడానికి గల కారణాలు చెప్తాను వినండి.

"అప్పుడు నేను నూనూగు మీసాల నూతన యువకుడిని.. ఉరకలు వేస్తున్నది పరువం... కాలేజీలో చదువుకుంటున్నాను... మా నాన్న మా అమ్మకు తెల్లచీర బహుమానంగా ఇచ్చి తను మరోలోకాలకు తరలి పోయాడు... అక్షరం ముక్కరాని ఏ ఆస్థిపాస్థులు లేని అమ్మ వారింటా వీరింటా పనిచేసి, అరిసెలు జంతికలు చేసి జంగిడంలోపెట్టుకుని ఇల్లిల్లు తిరిగి అమ్మింది... అలా కష్టపడి నన్ను చదివించింది.

'వున్న చిన్న పెంకుటిల్లు అమ్మేసి ఆ డబ్బు

---

**-కేక-**

ఆకలిజ్వాలకి దహించిన-
ఓ శీలం కేక-
పట్టాలపై రైలు కూతలో-
కలిసిపోయింది!

– సాయిప్రకాష్

---

నా కాలేజీ చదువుకని దాచి పెట్టి ఊరిబయట పోరంబోకు స్థలంలో పాకేసుకుని బతుకుతున్నాము. స్నేహితుల బాధతోను, వయసు ప్రభావంవల్లను అమ్మదాచిన డబ్బు దొంగతనంగా తీసుకుని ఓ రాత్రి మధురవాణి ఇంటికి వచ్చి తలుపుకొట్టాను.

తలుపుతీసిన మధురవాణి నన్ను చూసి గుమ్మంలో పాముని చూసినంతగా ఒణికిపోయింది. నన్నా ఊబిలో పడకుండా కాపాడింది.

'నా దగ్గర డబ్బు లేదనుకుంటున్నదని జేబు లోంచి డబ్బుతీసి చూపించాను. నేనే మీ బీదవాడిని కాదన్నట్లుగా...!

"ఇదిగో డబ్బు తీసుకుని నన్ను లోపలకు రానియ్యి...!" నా దగ్గర డబ్బు తీసుకోకుండా రా బాబూ... అని నన్ను లోపలకు రమ్మంది.

నన్ను కూర్చోమని కుర్చీ చూపించి "బాబూ నాకీ డబ్బు వద్దు... కానీ నేను చెప్పే మాటలు మాత్రం శ్రద్ధగా విను... ఇంచుమించు మీ అమ్మా నేనూ ఒకే ఈడు వాళ్ళం... ఆమె నన్నేనాడు కన్నెత్తి చూడదు. పన్నెత్తి పలకరించదు... అలాంటి పతివ్రతా శిరోమణి నువ్వు టెన్త్ చదువుతున్న రోజులలో ఓ నాడు మా ఇంటికి డబ్బు అప్పు అడగడానికి వచ్చిందంటే మీ తల్లికి ఎంతటి ఆర్థిక కష్టమో నువ్వు ఊహించగలవా...? అది నీకు పరీక్ష ఫీజు కట్టడానికి డబ్బెక్కడా అప్పు దొరకలేదని... ఒకటి రెండు రోజులలో ఫీజు కట్టకపోతే నువ్వు పరీక్షలు రాయలేవని... ఒక సంవత్సరం వృథా అయిపోతుందని కంటతడి పెట్టుకుందా తల్లి...

"నా సంపాదన... నేను సంపాదించిన డబ్బు ఒక మంచి పనికి ఉపయోగపడడం నాకెంతో సంతోషమే...! కానీ, నాకున్న సందేహం మీ అమ్మగార్కి చెప్పితే ఆమె ఇచ్చిన వివరణ నన్ను పులకింపచేసింది.

"మధురవాణీ, స్మశానం నుంచి బూడిద తీసుకొచ్చి పొలాల్లో ఎరువుగావేస్తే మంచి పంటలు పండడంలేదూ... కుక్కలను అమ్మగా వచ్చిన కాసు కరుస్తుందా...? ఇదీ అంతే..? నువ్వే మార్గంలో సంపాదించిన డబ్బు అయినా అది డబ్బే... నీ సంపాదన డబ్బు నా కొడుక్కు పరీక్ష ఫీజు కడితే వాడిని పరీక్షకు కూర్చోనీయరా..! వాడు పరీక్ష పాసుకాడా...? అని మీ అమ్మగారు చెప్పగానే మారు మాటాడకుండా ఆమె అడిగిన మొత్తం ఇచ్చి పంపించాను... ఆనాడే నువ్వు నా కొడుకు వనుకున్నాను...!

"నేనెంత వద్దన్నా వినకుండా ఆ మహాసాధ్వి పైసా పైసా కూడపెట్టి నా అప్పు తీర్చింది. నీ బంగారు భవిష్యత్తుకోసం నిన్ను పెద్ద చదువులు చదివించడానికి రెక్కలు ముక్కలు చేసుకోవడం కాకుండా, వుంటున్న ఇంటిని అమ్మి డబ్బుదాచితే ఆ డబ్బు దొంగిలించి నా దగ్గరకు వస్తావా...

"ఇంచుమించు నీ తల్లి ఈడు దానిని... విచక్షణా జ్ఞానం లేదూ... చదువుకున్న వాడివి...!" అని మొహం వాచేట్లు చివాట్లు పెట్టడంతోపాటు ఓ సినిమాలో సంఘటన ఉదాహరణగా చెప్పింది.

"పాత సినిమా కృష్ణవేణి నటించిన గొల్లభామ సినిమాలో తల్లి కొన్ని కారణాంతరాలవల్ల వేశ్యా వృత్తిని చెయ్యవలసిన నిర్బంధం.

"తల్లి దగ్గరకే విటుడుగా వెడుతున్న కొడుకు దారిలో వున్న దూడ తోక గట్టిగా తొక్కుతాడు... దూడ బాధతో 'అంబా' అని అరుస్తూ తల్లి ఆవుతో తన నొప్పిని చెప్తుంది... అందుకా ఆవు "కన్నతల్లి... జన్మనిచ్చిన తల్లి దగ్గరకే... ఛీ... ఛీ... కళ్లు మూసుకుని విటుడై వెడుతున్న వాడికి నీ తోకెలా కనిపిస్తుంది...?" ఆవు అన్న మాటలు జంతువుల బాష తెలిసిన రాకుమారుని మీద స్తన్యధారలు కురిసి ఆమె తల్లి అని తెలుసుకుని తిరిగి వెళ్లిపోతాడు. ఇలా ఉదాహరణలతో చెప్పి మందలించి మంచి మార్గంలో పెట్టినామె నాకు తల్లితో సమానం కాదా..

"ఓసారి గుడిలో వేదాంతోపన్యాసంలో, కేవలం భగవద్గీతలోనే వేదాంత తత్వం లేదు... ప్రతీ మనిషి మనసులోనూ ధర్మతత్వం ఇమిడి వుంది... సమయం వచ్చినప్పుడది బయటపడుతుందని ఉపన్యాసకులు చెప్పింది విన్నప్పుడు నాకు మధురవాణి చేసిన హితబోధ గుర్తుకొచ్చింది.

"ఆనాడు మధురవాణి నా దగ్గరున్న డబ్బుకు

ఆశపడి వున్నట్లయితే నేనీనాడు ఇంత వున్నత స్థానంలోకి వచ్చి వుండేవాడినా... నేను సంపాదనా పరుడనైన తరువాత అమ్మ ఫోమ్ బెడ్లమీద పడుకుంది. కాలు కిందపెట్టకుండా కార్లలో తిరిగింది. ఎయిర్ కండిషన్ బంగళాలో సుఖంగా జీవించింది. చనిపోయాక చందనం కట్టెలలో కాలింది... కానీ మధురవాణి...!"

ఒంట్లో శక్తి ఉడిగాక నా అనే చూసేవాళ్లు లేక నానా అవస్థలు పడింది.

"ఆనాడు మధురవాణి దగ్గరకు వెళ్లమని ఈ ఊరే ప్రోత్సహించింది, ఇప్పుడు ఆమె మరణిస్తే, ఆమెకు అంత్యక్రియలు చేశానని నన్ను కులం నుంచి బహిష్కరించి పొలెం పొలిమేరలు తొక్కకూడదని నన్ను వెలివేసిన ఈ పంచాయితీ పెద్ద, సభ్యులు అందరూ నా బాల్య మిత్రులు... మధురవాణితో సంబంధం పెట్టుకున్నవారే.. వాళ్లలో ఏ ఒక్కరూ మధురవాణి బతికున్నన్నాళ్లు ఆదుకునేందుకు ముందుకు రాలేదు... మరణించాక ఆమెకు దహన సంస్కారాలు చేసేందుకు ముందుకు రాలేదు... అని కాసేపు ఆగిన శర్మ "మునసబుగారూ, ఇప్పుడు మీరే చెప్పండి... దోషిని నేనా... వీరా... కులం నుంచి బహిష్కరించవలసింది నన్నా వీళ్ళనా...?" అని శర్మ ప్రశ్నిస్తూండగానే, శర్మను వెలివెయ్యడం మాట అలా వుంచి ఇంకా తాము అక్కడే వుంటే తమ పరువు పోతుందని నెత్తిన గుడ్డేసుకుని మొహం కనపడకుండా ఒక్కొక్కరే రచ్చబండ నుంచి జారుకుంటున్నారు...

■

## పోలిక

ఒకప్పుడు
పెళ్లిళ్లు అయిదు రోజులు జరిగేవి
ఫైవ్‌డేస్ టెస్ట్ పోటీల లాగా!
ఇప్పుడు
పెళ్లిళ్లు ఒక రోజే జరుగుతున్నాయి
ఒన్ డే మ్యాచ్‌ల లాగా!!

**- తాజీ ప్రసాద్**

## ఆర్ ఎస్ కృష్ణమూర్తి కథలపోటీ

ఆర్ ఎస్ కృష్ణమూర్తి 2005 అవార్డు కథలపోటీకి ఎంట్రీలను నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు. కథలు 20 ఫుల్‌స్కేప్ పేజీలు మించరాదు. మార్చి 31వ లోగా కథలు అందవలసిన చిరునామా - ఎన్ఎస్ మూర్తి, 8-100 నాయుడుతోట బస్‌స్టాప్, వేదగుంట పోస్టు, విశాఖపట్నం - 47. ఉత్తమ కథకు మూడువేలు, ద్వితీయ ఉత్తమ కథకు రెండు వేలు పారితోషికం.

## "అల" ఉగాది కథల పోటీ

ఉగాది సందర్భంగా అల కమ్యూనికేషన్స్ రాష్ట్రస్థాయి పోటీ నిర్వహిస్తోంది. లబ్ధప్రతిష్ఠులైన రచయితలే కాక నవయువ రచయి తలు పాల్గొన వచ్చును. కథా వస్తువు రచయిత ఇష్టమేకాని శైలి, శిల్పం బాగుండాలి. ఎన్నికైన ఉత్తమ కథ లకు ప్రథమ బహుమతి రూ. 3,000, ద్వితీయ బహుమతి రూ. 2,000, తృతీయ బహుమతి రూ. 1,000, సాధారణ ప్రచురణకు ఎన్నికయిన ప్రతి కథకు రూ. 100లు పారితోషికం లభిస్తుంది. ఈ కథలన్నిటిని సంకలనం తెచ్చే ప్రయత్నముంది. 1. కథ అరఠావు సైజులో కనీసం ఎనిమిది పేజీ లుండాలి. 2. కథ పేజీకి ఒకవైపు మాత్రమే రాయాలి. 3. ఇతర పత్రికల్లో పరిశీలనలో ఉన్నవి. ఇంతకు ముందు ప్రసారం కాబడిన, ప్రచురించబడిన కథలు పంపకూడదు. 4. అనువాదం, కాపీ కాదని హామీ పత్రం తప్పని సరి. 5. బహుమతి ఎంపిక హక్కు అల కమ్యూనికేషన్స్ యాజమా న్యానిదే. వివాదా లకు తావులేదు. కథలు తిప్పి పంపగోరువారు తగు పోస్టేజి జతపరచాలి. 6. కథపేరు, రచయిత పేరు కథలో ఎక్కడా రాయకూడదు. విడిగా ఒక పేపరు మీద పూర్తి చిరునామాతో రాసి జత చేయాలి. 8.కథలు మాకు చేరవల సిన చివర తేదీ : మార్చి 15. కథలు పంప వలసిన చిరునామా : **అల కమ్యూనికేషన్స్, ఫ్లాట్ నెం. 21, బ్లాక్ నెం. 2, ఎంఐజి 5వ ఫేజు, కెపిహెచ్‌బి కాలనీ, హైదరాబాద్ -72.**